సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం। 7। జూన్। 2024



టన్ను చీనీ రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 684 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.



టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో గురువారం ఉదయానికి 1,581 క్యూసెక్కులకు చేరింది. ప్రసుతం 1,578.14 అడుగుల నీటి మట్టంతో 3.630 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
34.7°/22.6°

జిల్లాలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోత ఉండగా, ఆ తర్వాత ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

కచ్చితంగా పంట సాగు చేయాల్సిందే

- జిల్లా వ్యవసాయ అధికారి వైవీ సుబ్బారావు



రైతులకు సూచనలిస్తున్న డీఏఓ వైవీ సుబ్బారావు

తలుపుల: ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ, ఇతర పంటలు సాగు చేసిన వారికే ఈ-క్రాప్ బుకింగ్ చేస్తామని, ప్రతి రైతూ కచ్చితంగా పంట సాగు చేయాల్సిందేనని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ సుబ్బారావు రైతులకు సూచించారు. మండలంలోని కుర్లి, లక్కసముద్రం గ్రామాల్లో రైతులు తీసుకొన్న సబ్సిడీ విత్తన వేరుశనగకాయలు ఏఓ షాదాబ్‌తో కలిసి పరిశీలించారు. అలాగే విత్తన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. మండలానికి ఎన్ని క్వింటాళ్లు విత్తన వేరుశనగ మంజూరైంది? స్టాక్ ఎంత వచ్చింది? ఎంత మంది రైతులు తీసుకొన్నారు తదితర విషయాలను ఏఓతో ఆరా తీశారు. సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని సాగుకు ఆసక్తి ఉన్న రైతులకు విత్తన వేరుశనగ అందించాలని ఏఓకు సూచించారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయకు చెక్



కదిరేపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ మంజువాణి

మడకశిరరూరల్: బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. ఆమె గురువారం మడకశిర మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వివిధ రికార్డులను పరిశీలించారు. అదే విధంగా బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వ్యాక్సిన్ వేయించుకున్న వారితో ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ ప్రాధాన్యతను వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా మంజువాణి మాట్లాడుతూ అర్హత ఉన్న వారు వ్యాక్సిన్ వేయించుకుని క్షయవ్యాధిని కట్టడి చేసి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. టీకా వేయించుకున్న వారిని వైద్య సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో పర్యటించి 60 ఏళ్లు నిండి క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి, వారి కుటుంబ సభ్యులకు టీకా వేసి క్షయ వ్యాధికి చెక్ పెట్టాలన్నారు. ప్రతి గురువారం టీకా కార్యక్రమం ఉంటుందని అర్హత ఉన్నవారు పొందాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్‌కుమార్, సూపర్‌వైజర్ రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు 18 మంది ఎంపిక





జిల్లాలో మొదటిస్థానంలో నిలిచిన లక్ష్మీనివాస్, పల్లవి

ధర్మవరం అర్బన్: ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ధర్మవరంలోని ఏపీ మోడల్ స్కూల్ నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పద్మశ్రీ తెలిపారు. ఇందులో లక్ష్మీనివాస్, పల్లవి జిల్లా ఫస్ట్ సాధించారన్నారు. ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ఏటా రూ.12 వేలు చొప్పున నాలుగేళ్లు పాటు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు.

పారాహుషార్

- హిందూపురం ముక్కిడిపేటకు చెందిన 18 ఏళ్ల కుర్రాడికి ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం హాబీ. వారం రోజులుగా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఫోన్ చేసిన వ్యక్తులు క్రికెట్, పేకాట బెట్టింగ్‌లో పాల్గొనాలని, లోన్ యాప్స్ ద్వారా డబ్బు అప్పుగా ఇస్తామని ఆశ చూపారు. తమ వద్ద ఆన్‌లైన్ ద్వారా అప్పుతీసుకొన్న వారు షేర్ మార్కెట్‌లో లక్షలు సంపాదించారని నమ్మబలికారు. అయితే ఆ యువకుడు తెలివిగా ఆలోచించి తనకు ఈ ఫేక్ కాల్స్ ఎక్కడ నుంచి వస్తున్నాయా అని ఆరా తీశాడు. సుమారు 12 యాప్స్ వరకు తనకు తెలియకుండానే తన మొబైల్‌లో ఇన్‌స్టాల్ అయి ఉన్నాయి. ఆ యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకునే సమయంలో అన్ని పర్మిషన్లను ఓకే చేయడంతో ఫోన్‌లోని కాల్‌డేటా, కాంటాక్ట్ లిస్ట్ , కెమెరా యాక్సెస్, లొకేషన్ పూర్తిగా యాప్ నిర్వాహకుల చేతుల్లోకి వెళ్లి పోయిందని, ఆ వివరాలను వారు పలు కంపెనీలకు విక్రయించారని సైబర్ పోలీసుల ద్వారా తెలుసుకొని ఖంగుతిన్నాడు. ఆఖరికి ఫోన్‌లో అవసరం లేని యాప్స్‌ను అన్ ఇన్‌స్టాల్ చేశాడు.
- చిలమత్తూరుకు చెందిన ఓ యువకుడు వారి ఇంటిలో తెలియకుండా ఆన్‌లైన్ యాప్స్ ద్వారా అప్పు తీసుకొని గేమ్స్‌లో పోగొట్టాడు. అది సంపాదించేందుకు మరింత అప్పు చేశాడు. ఆఖరికి అప్పు తీర్చలేకపోవడంతో రుణం పొందిన యాప్స్ నిర్వాహకులు అతనిపై ఒత్తిడి చేయడంతో వారం రోజులు ఆ యువకుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. చివరకు మిత్రుల ద్వారా జరిగిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు విషయం బయట పొక్కకుండా అప్పు చెల్లించి అతన్ని కాపాడుకున్నారు. లేదంటే ఆత్మహత్యకు పాల్పడే వాడని తరువాత తెలిసింది.

- కొంపముంచుతున్న యాప్‌లు
- స్మార్ట్‌ఫోన్ పర్మిషన్లతో రెచ్చిపోతున్న మోసగాళ్లు
- వ్యక్తిగత సమాచారం మొత్తం అపహరణ
- వివిధ పద్ధతుల్లో బెదిరింపులు
- నిండా మునుగుతున్న యువత



హిందూపురం అర్బన్: చిన్న పిల్లాడు మొదలు వృద్ధుల వరకూ అధిక శాతం మంది స్మార్ట్‌ఫోన్లకు బానిసలయ్యారు. గంటల తరబడి యూట్యూబ్, ఫేస్‌బుక్ ఇన్‌స్టాగామ్ తదితర వాటిలో వీడియోలు, చిట్‌చాటులు చేస్తున్నారు. అయితే ఇదే అదునుగా భావించిన సైబర్ నేరగాళ్లు అనేక మోసాలకు తెరలేపుతున్నారు. మొబైల్ బ్యాంకింగ్, ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యాప్‌లను ప్రతి ఒక్కరూ వాడుతున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు కూడా రెచ్చిపోతున్నారు. మీ బ్యాంకు అకౌంట్ బ్లాక్ అయిందని, మీకు గిఫ్ట్ తగిలిందని, పెళ్లి సంబంధాల పేరుతో, ఫోన్ నంబర్‌లకు లాటరీ తగిలిందని ఇలా ఏదో ఒక రీతిలో అమాయక ప్రజలకు మాయ మాటలు చెప్పి వారు చెప్పిన లింక్‌లపై క్లిక్‌చేయించడమో లేకపోతే ఓటీపీల ద్వారా డబ్బు కాజేయడమో ఎక్కువగా జరుగుతోంది.

రుణాల పేరుతో బురిడీ..

స్మార్ట్‌ఫోన్లు వినియోగించే వారి సంఖ్య అంతకంతకూ పెరిపోతుండటంతో పక్కదారి పడుతున్న వారి సంఖ్య కూడా అధికంగా ఉంది. క్రికెట్ బెట్టింగ్‌లు, పేకాట, వివిధ ఆన్‌లైన్ గేముల్లో డబ్బులను పోగొట్టుకుంటున్న వారి సంఖ్యకు లెక్కేలేదంటూ అతిశయోక్తికాదు. ఈ నేపథ్యంలోనే లోన్ యాప్స్ ముసుగులో అమాయకుల జీవితాలతో వాటి నిర్వాహకులు ఆటలాడుతున్నారు. మీరు బెట్ కట్టండి... అప్పు మేమిస్తామంటూ మోసకారి మాటలతో ముఖ్యంగా యువతను టార్గెట్ చేస్తున్నారు. దీంతో మంది లోన్ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడంతో పాటు బెట్టింగ్‌లలో రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఆ తర్వాత లోన్‌యాప్స్ నిర్వాహకుల ఒత్తిడితో డబ్బులు చెల్లించే పరిస్థితి లేక కొందరు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. కొందరు తల్లిదండ్రులు మాత్రం వారి బిడ్డలను కాపాడుకునేందుకు డబ్బులు చెల్లిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి !

కొన్ని యాప్స్‌కు ఎండ్‌లు, ఎండ్‌స్క్రిప్షన్స్ ఉండవు. అలాంటి యాప్స్ వాడే వారు జాగ్రత్తగా ఉండాలి. రెగ్యులర్‌గా వాడని యాప్స్‌కు ఉన్న పర్మిషన్స్‌ను తొలగించాలి. అనవసరమైన యాప్స్ మొబైల్ నుంచి తొలగించడమే కాకుండా అవసరం లేని యాప్స్ ఇన్‌స్టాల్ చేయడం మంచిది కాదు.

అప్రమత్తత లేకుంటే సమస్యలే..

మొబైల్ అప్లికేషన్స్‌కు ఇచ్చే అనుమతుల విషయంలో అప్రమత్తంగా లేకుంటే చాలా ఇబ్బందులు తలెత్తుతాయని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. యాప్ పర్మిషన్స్ (లొకేషన్, కాల్‌డేటా, కాంటాక్ట్ , మైక్రోఫోన్‌కు పర్మిషన్ ఇవ్వడం) విషయంలో జాగ్రత్త లేకపోతే వ్యక్తిగత సమాచారం నేరగాళ్లకు చేరవేసినట్లేనని చెబుతున్నారు. కెమెరా, మైక్రోఫోన్ పర్మిషన్స్ అన్నింటికన్నా ప్రమాదమంటున్నారు. ఆర్‌బీఐ గుర్తింపులేని 140కిపైగా లోన్ యాప్స్ నిర్వాహకుల మోసానికి ఇప్పటికే వేలాది మంది బలయ్యారు.



బాధితులకు అండగా ఉంటాం



ఉపయోగ పడని ఏ యాప్‌నైనా సరే స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోకపోవడమే మేలు. యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి వచ్చినా పర్మిషన్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. పొరపాటున ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే సైబర్ సెల్‌ను ఆశ్రయించాలి. లేకపోతే సమీపంలో ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేయాలి. బాధితులకు పోలీసులు అన్ని విధాలా అండగా ఉంటారు. – కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ప్రత్యేక కమిటీ

పుట్టపర్తి టౌన్: టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలిచేందుకు ఆ పార్టీ అధిష్టానం ఓ కమిటీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఎన్నికల తరువాత భయాందోళనకర వాతావరణం నెలకొంది. టీడీపీ దాడుల నేపథ్యంలో రాష్ట్రంలో అత్యంత భయాందోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ఏర్పడక ముందే టీడీపీ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా చెలరేగుతున్నాయి. ఎక్కడిక్కడ దాడులు చేస్తున్నారు. దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలు తోడుగా నిలిచేందుకు 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు పార్టీ అధిష్టానం కమిటీలు ఏర్పాటు చేసింది. కమిటీ సభ్యులు బాధితులైన నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సైనికులకు అన్ని విధాలా అండగా నిలవనున్నారు. న్యాయ, వైద్య, ఆర్థికపరంగా సహాయంగా నిలవనున్నారు. హిందూపురం పార్లమెంట్ కమిటీ సభ్యులుగా నవీన్ నిశ్చల్, జె.శాంత, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, కేవీ ఉషశ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, బీఎస్ మక్బూల్, ఎస్ఎల్ ఈరలక్కప్ప, టీఎన్ దీపికను నియమిస్తూ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు హాకీ జట్టు ఎంపిక పోటీలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 8వ తేదీన జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించనున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ధర్మవరంలో జరిగే సీనియర్ హాకీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే సీనియర్ క్రీడాకారులు 01-01-1995 అనంతరం జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణపత్రం తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు.

గ్రామాల్లో భయం భయం

టీడీపీ శ్రేణుల దాష్టీకాలు ఆగడం లేదు. వీరి వీరంగంతో గ్రామాల్లో భయాందోళన నెలకొంది. స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తుండడంపై విస్తుపోతున్నారు.

- టీడీపీ శ్రేణులు రెచ్చిపోతుండడంతో ప్రజల్లో ఆందోళన
- ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తుండడంపై విస్మయం



గొరిదిండ్లలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యం



ఎం. అగ్రహారంలో సచివాలయ శిలాఫలకం ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామంలో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయారు. గురువారం సాయంత్రం సచివాలయం, రైతు భరోసా కేంద్రం బోర్డులను ధ్వంసం చేశారు. ఉద్యోగులంతా ఇళ్లకు వెళ్లిపోయిన తర్వాత కొందరు టీడీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకని ఈ ఘాతుకానికి పాల్పడ్డారని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. రెండు రోజుల క్రితం రాప్తాడు మండలం పాలచెర్ల గ్రామంలోని సచివాలయంలో ఉద్యోగులను బెదిరించి కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ప్రింటర్, బాత్రూం డోర్లు, సింథటిక్ ట్యాంక్ పైపులను ధ్వంసం చేశారు. ఈ ఘటన మరవకముందే ఉప్పరపల్లిలో సచివాలయం, ఆర్బేకే కార్యాలయాల బోర్డులను ధ్వంసం చేయడం చర్చనీయాంశమవుతోంది. ఈ ఘటనపై శుక్రవారం సచివాలయ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

వైఎస్సార్ విగ్రహం కూల్చివేత..

ఆత్మకూరు: మండలంలోని గొరిదిండ్ల గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. పగులగొట్టి నేలమట్టం చేశారు. ప్రజలు నమ్మి ఓట్లు వేశారని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పలువురు హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక ఎక్కడా ఎన్‌టీఆర్ బొమ్మలను కనీసం ముట్టలేదని, కానీ నేడు ఇలా దాడులకు పాల్పడడం సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

సచివాలయ శిలాఫలకం ధ్వంసం..

ధర్మవరం: తాడిమర్రి మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలోని గ్రామ సచివాలయం శిలాఫలకాన్ని గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు గురువారం ధ్వంసం చేశారు. రెండేళ్ల క్రితం రూ.40 లక్షలతో గ్రామం సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన గ్రామ సచివాలయం నిర్మించారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ తదితర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పేర్లను తెలుపుతూ గ్రామ సచివాలయ గోడకు అతికించిన శిలాఫలకాన్ని గ్రామానికి చెందిన కొండన్నగారి శివయ్య, కే.నాగరాజు, కే.రామకృష్ణ, కే.రాజేష్, నీరుగంటి రవీంద్ర, సాకే మదన్‌మోహన్, నీరుగంటి రాజశేఖర్, బాటన్నగారి లక్ష్మన్న, నీరుగంటి నాగార్జున, నీరుగంటి శివానంద, అయ్యన్నగారి నాగరాజు పిన్నదరి శ్రీమన్నారాయణ, నారాయణస్వామి తదితర టీడీపీ కార్యకర్తలు ఇనుప సుత్తితో పగుల గొట్టారు. ఎస్ఐ నాగస్వామి గ్రామానికి వెళ్లి దుండగులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ ఫిర్యాదు మేరకు ఆయన నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తులు ధ్వంసం చేయడం, గొడవలు, ఘర్షణలకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు.

వార్డు సభ్యురాలి ఇంటిపై దాడి..

సోమందేపల్లి: మండల కేంద్రంలోని మారుతినగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ వార్డు సభ్యురాలు ఆశాబీ ఇంట్లోకి గురువారం మధ్యాహ్నం టీడీపీ కార్యకర్తలు చొరబడి దాడి చేశారు. ఈ నెల 4న ఆశాబీ ఇంటి ముందు టీడీపీ కార్యకర్తలు టపాసులు కాల్చడంపై ఆమె కుమారులు అక్బర్, ఇర్ఫాన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దాన్ని మనసులో పెట్టుకున్న వారు గురువారం తన ఇంట్లోకి చొరబడి కుమారులపై దాడి చేయడంతో పాటు ఆస్తి నష్టం చేసినట్లు బాధితురాలు వాపోయారు. భయభ్రాంతులకు గురైన తన కుమారులు గ్రామం నుంచి పరారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

కొడికొండలో భయోత్పాతం..

చిలమత్తూరు: మండలంలోని కొడికొండలో బుధవారం టీడీపీ నేతల విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగానే అదే పనిగా వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్ల ముందు బాణాసంచా కాల్చి ఇబ్బందులకు గురిచేశారు. ఇదేమటని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముస్తు పై టీడీపీ నేత బాలాజీ దాడి చేశారు. పక్కటెముకలు విరిగిపోగా ముస్తును చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. ఇదిలా ఉంటే ఈనెల 2న వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహమూర్తిపై కూడా టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. అదే విధంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఈడిగ నాగభూషణ ఇంట్లో చొరబడి దాడికి యత్నించారు. మండలంలోని కొడికొండ పంచాయతీలో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ రాగా జీర్ణించుకోలేక దాడులకు తెగబడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాడి చేసిన టీడీపీ కార్యకర్తలు నరసింహులు, నాగేంద్రబాబులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

సచివాలయ శిలాఫలకం ధ్వంసం



అగ్రహారంలో టీడీపీ కార్యకర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

ధర్మవరం: తాడిమర్రి మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలోని గ్రామ సచివాలయం శిలాఫలకాన్ని గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు గురువారం ధ్వంసం చేశారు. రెండేళ్ల క్రితం రూ.40 లక్షలతో గ్రామం సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన గ్రామ సచివాలయం నిర్మించారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ తదితర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పేర్లను తెలుపుతూ గ్రామ సచివాలయ గోడకు అతికించిన శిలాఫలకాన్ని గ్రామానికి చెందిన కొండన్నగారి శివయ్య, కే.నాగరాజు, కే.రామకృష్ణ, కే.రాజేష్, నీరుగంటి రవీంద్ర, సాకే మదన్‌మోహన్, నీరుగంటి రాజశేఖర్, బాటన్నగారి లక్ష్మన్న, నీరుగంటి నాగార్జున, నీరుగంటి శివానంద, అయ్యన్నగారి నాగరాజు పిన్నదరి శ్రీమన్నారాయణ, నారాయణస్వామి తదితర టీడీపీ కార్యకర్తలు ఇనుప సుత్తితో పగుల గొట్టారు. ఎస్ఐ నాగస్వామి గ్రామానికి వెళ్లి దుండగులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ ఫిర్యాదు మేరకు ఆయన నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేయడం కానీ అకారణంగా గొడవలు, ఘర్షణలకు దిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు.



ధ్వంసమైన శిలాఫలకం

హెచ్ఎల్‌సీకి 26.36 టీఎంసీలు

- కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు 172 టీఎంసీలు

రాయదుర్గం: హెచ్ఎల్‌సీకి 26.36 టీఎంసీల నీటిని కేటాయిస్తూ టీబీ బోర్డు కార్యాలయం తీర్మానించింది. తుంగభద్ర జలాశయం నుంచి 2024-25 ఖరీఫ్‌లో ఆయకట్టుకు అందించే సాగునీటి కేటాయింపులు ఖరారయ్యాయి. గురువారం విజయనగర (హొస్పేట్) టీబీ బోర్డు కార్యాలయంలో బోర్డు ఎస్ఈ ఆర్ శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో కర్ణాటక, అనంత పురం, కర్నూలు జిల్లాల ఇంజినీరింగ్ అధికారుల బృందం సమావేశమై చర్చించారు. జలాశయం నీటి లభ్యత 212 టీఎంసీలు కాగా, ఈ ఏడాది వివిధ కారణాలతో 172 టీఎంసీల నీరు జలాశయంలోకి చేరవచ్చనే అంచనాకు వచ్చారు. ఇందులో దామాషా ప్రకారం కర్ణాటక రాష్ట్రానికి 112.765 టీఎంసీలు, ఏపీకి 53.953 టీఎంసీలు, తెలంగాణకు 5.282 టీఎంసీల నీటిని కేటాయించారు. హైలెవెల్ (హెచ్ఎల్‌సీ)కి 26.368 టీఎంసీలు కేటాయించారు.

జిల్లాపై నైరుతి ప్రభావం



మడకశిరలో వర్షం కురుస్తున్న దృశ్యం



పుట్టపర్తి మండలం పెడపల్లి వద్ద పొలాల్లో నిలిచిన వర్షం నీళ్లు



కప్పలబండ వద్ద చెక్‌డ్యాంలో చేరిన నీళ్లు

- 27 మండలాల్లో వర్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

పుట్టపర్తి అర్బన్: ఇటీవల జిల్లాలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరికొన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతోంది. బుధవారం రాత్రి జిల్లాలోని 27 మండలాల్లో వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి బత్తలపల్లి మండలంలో అత్యధికంగా 63.4 మి.మీటర్లు, ధర్మవరంలో 43.6, లేపాక్షిలో 35.8, ఓడీ చెరువులో 35.4, హిందూపురంలో 33.8, పరిగిలో 30.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే ఎన్‌పీ కుంటలో 26.6, సోమందేపల్లిలో 26.4, తలుపులలో 24.4, చిలమత్తూరులో 20.4, గోరంట్లలో 19.2, గాండ్లపెంటలో 18.8, అమడగూరులో 18.2, తాడిమర్రిలో 16.4, కదిరి, కొత్తచెరువు మండలాల్లో 15.2, ముదిగుబ్బలో 14.8, పెనుకొండలో 13.2, సీకేపల్లిలో 12.4, బుక్కపట్నం, అమరాపురంలో 10.4, పుట్టపర్తి, నల్లచెరువులో 8.2, రామగిరిలో 6.8, నల్లమాడలో 4.8, కనగానపల్లిలో 4.2, మడకశిరలో 2.6 మి.మీటర్ల వర్షం పాతం నమోదైంది. జిల్లాలో 27 మండలాల్లో మొత్తం 539.4 మి.మీటర్ల వర్షం కురిసింది.



సోమందేపల్లిలో మేఘాలు ఆకాశాన్ని కప్పేసిన దృశ్యం

జోరుగా వ్యవసాయ పనులు..

జోరుగా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సీజన్‌లో వంద శాతం భూములు సాగులోకి వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రోడ్లపైనా, పొలాల్లో, చెక్‌డ్యాంలలో ఎక్కడ చూసినా నీళ్లు నిలుస్తున్నాయి. వర్షాలు పడుతుండటంతో అన్నదాతలు వ్యవసాయ పనులపై దృష్టిసారించారు. పుట్టపర్తి నుంచి కోడూరు వరకూ నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి 342పై పలు చోట్ల రోడ్డు కోతకు గురై కుంగింది. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్లు మరమ్మతు చేశారు.

క్లుప్తంగా

అంతర పంటల సాగు లాభదాయకం : డీడీఏ


సబ్సిడీ విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న డీడీఏ విద్యావతి

తాడిమర్రి: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటలో అంతర పంటల సాగుతో అధిక ఆదాయం గడించవచ్చునని రైతులకు డీడీఏ గుడిపల్లి విద్యావతి సూచించారు. తాడిమర్రిలోని ఆర్‌బీకేను గురువారం ఆమె తనిఖీ చేశారు. సబ్సిడీ విత్తన వేరుశనగ నిల్వలు, పంపిణీ రిజిస్టర్లను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ విత్తనం అందించాలని ఏఓ రమాదేవికి సూచించారు. అనంతరం సబ్సిడీ విత్తన వేరుశనగ గోదాములోని విత్తనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. విత్తనం సాగులో కంది, పెసర, అలసంద, ఆముదం తదితర అంతర పంటలను సాగు చేస్తే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. అలాగే మేర సాలల్లో సజ్జ, జొన్న తదితర పంటలు సాగు చేస్తే పంటకు చీడపీడలు ఆశించకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ విజయ్‌కుమార్, హెచ్ఏఏ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

వజ్రకరూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి తండాకు ఎస్.సక్రియానాయక్ (45) ఈ నెల 4న ద్విచక్ర వాహనంలో ఉరవకొండకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా పీసీ ప్యాపిలి క్రాస్ వద్ద రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమైన సక్రియానాయక్‌ను అటుగా వెళుతున్న వారు గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్సకు స్పందించక బుధవారం సాయంత్రం ఆయన మృతి చెందాడు. ఎస్‌బీఐలో బీమా ఏజెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న సక్రియానాయక్‌కు భార్య సుజాతతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రిమాండ్‌కు నిందితులు

గుంతకల్లు: ఈ నెల 13, 14వ తేదీల్లో తాడిపత్రిలో జరిగిన అల్లర్ల కేసులో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 11 మంది అనుచరులను రిమాండ్‌కు ఆదేశిస్తూ గుంతకల్లు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మంజుల ఉత్తర్వులు ఇచ్చారు. నిందితులను గురువారం స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు. అనంతరం 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్‌కు న్యాయమూర్తి ఆదేశించడంతో నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

పిడుగు పడితే విధ్వంసమే

- చిన్నపాటి పిడుగు పాటుకే ప్రాణ నష్టం తప్పదు
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు


వర్షం వచ్చే ముందు కమ్ముకున్న మేఘాలు


వర్షం ఆరంభానికి ముందు ఆకాశంలో మెరుపులు

ధర్మవరం అర్బన్: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వానలు రానే వచ్చాయి. ఆకాశం మేఘాలతో అప్పుడప్పుడు జిగేల్మని మెరుపులతో వర్షం కురుస్తూ ఉంది. ఆకాశంలో ఉన్నంత వరకూ మెరుపు చూసేందుకు ఎంతో మనోహరంగా ఉంటుంది. అది భూమిని తాకితే.. విలయాన్ని, ప్రళయాన్ని సృష్టిస్తుంది. దీనినే పిడుగుపాటు అంటారు. చిన్నపాటి పిడుగు పాటు సైతం ప్రాణాలను హరిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పిడుగు పాటు అంటే...

భూమి మీద ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు నీరు ఆవిరిగా మారి ఆకాశంలో దాదాపు 25 వేల అడుగుల ఎత్తు వరకూ మేఘాలుగా ఏర్పడతాయి. పైనుంచి సూర్యరశ్మి అధికంగా తాకడం వల్ల తక్కువ బరువున్న ధనావేశిత మేఘాలు పైకి వెళతాయి. అధిక బరువుండే రుణావేశిత మేఘాలు కిందకు వస్తాయి. ధనావేశిత మేఘాలు చాలా ఎత్తుకు వెళ్లిపోయినప్పుడు దగ్గరలో మరే వస్తువు ఉన్నా అటువైపు ఎలక్ట్రాన్లు ప్రయాణిస్తాయి. ఆ క్రమంలోనే మేఘాల నుంచి ఎలక్ట్రాన్లు ఒక్కసారిగా విడుదలై విద్యుత్ క్షేత్రంగా మారి భూమి మీదకు దూసుకొస్తాయి. దీనినే పిడుగు పాటు అంటారు. దాదాపు ముప్పై కోట్ల ఓల్టుల విద్యుత్‌ను కలిగి ఉంటుంది. గృహ వినియోగ అవసరాలకు వాడే కేవలం 230 ఓల్టుల విద్యుత్ పోల్చుకుంటే ఇది ఎంత ప్రమాదకరమో ఊహించవచ్చు. పచ్చగా ఉండే భారీ వృక్షాలు సైతం పిడుగు పాటుకు మాడి మసైపోతుంటాయి. పిడుగు మనిషిని తాకినా, సమీపంలో పడినా ప్రాణాలు కోల్పోవడం ఖాయం. సమీపంలో పిడుగు పడ్డ శబ్దం విన్నవారి శరీర అవయవాలు చాలా వరకు దెబ్బతింటాయి. ఒక్కోసారి గుండె పనితీరు ఆగి మరణానికి దారి తీస్తుంది.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మంచిది...

- పెద్దపెద్ద శబ్దాలతో ఉరుములు ఉరిమే సమయాల్లో విశాలంగా ఉండే పంటపొలాలు, మైదానాల్లో ఉండకూడదు. సమతల ప్రదేశానికి చేరుకోవాలి. పొలాల్లో ఉన్నవారు ఆరుబయట తిరుగుతున్నవారు వెంటనే సమీపంలో ఉన్న సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. తడిసిన శరీరంతో ఆరుబయట తిరగకూడదు.
- ఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు విద్యుత్తు పరికరాలు, స్విచ్‌లు ముట్టకూడదు. టీవీలు ఇతర విద్యుత్తు ఆధారిత పరికరాలు వినియోగించకూడదు.
- కొండలు, ఇనుప స్తంభాలు, టవర్లు, విద్యుత్తు స్తంభాలు, చెరువులు, కోనేర్లు వంటి నీరు ఉన్న ప్రాంతాల్లో ఉండకూడదు.
- చెట్ల కింద ఉండడం శ్రేయస్కరం కాదు. కొబ్బరి చెట్టుకు పిడుగును ఆకర్షించే శక్తి ఎక్కువగా ఉంటుంది.
- గొడుగులు ధరించరాదు.
- సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి.
- శిథిల భవనాల్లో సేద తీరకూడదు. పిడుగు శబ్దానికి అవి కూలిపోయే ప్రమాదముంది.
- వాహనాల్లో ప్రయాణించే వారు మార్గం మధ్యలో సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో




పరిస్థితి విషమంగా ఉన్న మోక్షిత్, గాయపడిన జాంపుల జయసింహ, ఆటో డ్రైవర్ నాగేంద్ర

- నలుగురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

బత్తలపల్లి: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన జాంపుల జయసింహ, ఏడేళ్ల వయసున్న తన కుమారుడు మోక్షిత్‌తో కలసి ద్విచక్ర వాహనంపై గురువారం బత్తలపల్లికి బయలుదేరాడు. బత్తలపల్లి శివారులోకి చేరుకోగానే వేల్పుమడుగు నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో జయసింహాతో పాటు మోక్షిత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటో డ్రైవర్, అనంతపురంలోని బుడ్డప్పనగర్ నివాసి నాగేంద్రతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న వేల్పుమడుగు నివాసి నల్లప్పకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. వీరిలో మోక్షిత్, నల్లప్ప పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై ఏఎస్ఐ తిరుపాలు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

ఓడీచెరువు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని యువకుడి ఆచూకీని ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన సాయంతో పోలీసులు కనుగొన్నారు. వివరాలు... మండల కేంద్రం ఓడీ చెరువుకు చెందిన బాబావలి కుమారుడు ఎస్.షామీర్‌బాషా (28).. వెల్డింగ్ కూలి పనులతో కుటుంబానికి చేదోడుగా ఉంటూ వచ్చేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 27న తన తల్లితో గొడవపడి రూ.వెయ్యి తీసుకుని ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. రోజులు గడుస్తున్నా కుమారుడు ఇంటికి రాకపోవడంతో బంధువుల సాయంతో తల్లిదండ్రులు పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో మే 2న ఓడీ చెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఓడీసీ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. షామీర్‌బాషా ఫొటోలను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు చేరవేయడంతో పాటు క్రిమినల్ ఇంటిలిజెన్స్ సిస్టమ్ సాంకేతికత సాయంతో షామీర్‌బాషా ఆచూకీ కోసం ఎస్ఐ వంశీకృష్ణ గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం చిలమత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ప్రమాదంలో మృతి చెందిన యువకుడి ముఖకవళికలతో షామీర్‌బాషా పోలికలు సరిపోవడంతో అనుమానం వచ్చిన ఎస్ఐ వంశీకృష్ణ వెంటనే బాబావలి కుటుంబసభ్యులను పిలుచుకెళ్లి చూపించారు. మృతుడు షామీర్‌బాషానేనని తల్లిదండ్రులు నిర్ధారించారు. ఎక్కడో ఓ చోట బతికే ఉంటాడనుకున్నామని, ఇలా అర్ధంతరంగా చనిపోతాడని తాము ఊహించలేదంటూ తల్లిదండ్రులు బోరున విలపించారు. కాగా, షామీర్‌బాషా ఆచూకీ కనుగొనడంతో ఎస్ఐ వంశీకృష్ణ చూపిన చొరవను జిల్లా పోలీసు అధికారులు అభినందించారు.

మొక్కజొన్నలో యాజమాన్యం పాటించండి


గోవిందపల్లిలో సాగు చేసిన మొక్కజొన్న పంట

- తెగుళ్ల నివారణలో అప్రమత్తత అవసరం

బుక్కరాయసముద్రం: దీర్ఘకాలిక వేరుశనగ, వరి పంటల సాగు కన్నా తక్కువ పెట్టుబడితో ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న సాగు చేపడితే అధిక లాభాలు సాధించవచ్చునని రైతులకు బుక్కరాయసముద్రం మండల వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి సూచించారు. మొక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, కత్తెర పురుగు నివారణపై రైతులు చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు. నీటి వనరులు తక్కువగా ఉన్నా... తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలో త్వరగా పంట చేతికి వస్తుందన్నారు.

నాణ్యమైన విత్తనాలనే ఎన్నుకోవాలి..

మొక్కజొన్న సాగులో మేలు రకం విత్తనాలను ఎంచుకోవాలన్నారు. హైబ్రిడ్ రకాలు మార్కెట్‌లో అడ్వాంట-741, 751, 758, డెకాల్బ్-9178, 9144 అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇది అధిక దిగుబడిని ఇచ్చే మధ్యకాలిక రకం విత్తనమన్నారు. ఎండు ఆకు, కాండం కుళ్లు, కంకి ఎండు తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుందన్నారు. కోత సమయంలో కర్ర పచ్చిగా ఉండి మేలైన పశుగ్రాసంగా పనికి వస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఈ రకం విత్తనాలు ఎంతో అనువైనవన్నారు. పంట సాగుకు నీరు ఇంకే నల్లరేగడి, ఎర్రనేలలు ఎంతో అనుకూలమన్నారు. నీరు ఇంకే నేలలు ఈ పంట సాగుకు పనికి రావన్నారు. విత్తే సమయంలో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ ఎం-45 లేదా కాప్టాన్ మందుతో తప్పని సరిగా విత్తన శుద్ధి దిగుబడి ఆశించిన మేర ఉంటుందన్నారు.

కలుపు యాజమాన్య పద్ధతులు..

పంట విత్తిన 2, 3 రోజుల్లోపు అట్రజిన్ అనే కలుపు మందును ఎకరాకు 200 లీటర్లు నీటికి 800 గ్రాములు కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఇలా చేయడం వలన ఒక నెల పాటు కొన్ని గడ్డిజాతి మొక్కలు పెరగకుండా అదుపు చేయవచ్చు. విత్తిన 30-35 రోజులకు పశువులు లేదా ట్రాక్టర్‌తో అంతర కృషి చేస్తే కలుపు నివారించుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం..

మొక్కజొన్న విత్తిన 30-35 రోజుల మధ్య ఉన్నప్పుడు ఎకరాకు 30 కిలోల నత్రజని, 50 కిలోల పొటాష్ వేసుకోవాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేటు వేసుకోవాలి. మొక్కల ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారుతున్నట్లు కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేటు కలిపి పిచికారీ చేయాలి. పొలాల్లో పైపాటి ఎరువులు వేసేటప్పుడు భూమిలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి.

సస్య రక్షణ చర్యలు ..

మొక్కజొన్న పంట రబీలో సాగు చేసే సమయంలో గులాబీ రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. పిల్ల పురుగులు మొదట ఆకుల పత్రహరితాన్ని గోకి తింటాయి. తర్వాత ముడుచుకుని ఉన్న ఆకు ద్వారా కాండంలోకి చేరుతాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వలన మొవ్వ చనిపోయి ఎండిపోతుంది. వీటి నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పొలంలో కలుపు మొక్కలు, చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేసుకోవాలి. పురుగు ఆశించిన మొక్కలు పీకి దూరంగా తీసుకెళ్లి నాశనం చేయాలి. పొలం చుట్టూ 3-4 వరుసల జొన్నను ఎర పంటగా వేసి 40 రోజుల తరువాత తీసి వేయాలి. మొక్క జొన్నలో అంతర పంటగా కంది, సోయాబీన్, సాగు చేయడం వలన పురుగు ఉధృతి తగ్గుతుంది. మోనోక్రోటోఫాస్-36 320 మిల్లీ లీటర్లు లేదా, క్లోరాంట్రినిలిప్రోల్ (కొరాజిన్, రైనాక్సిపర్) లాంటివి ఎకరాకు 60 మిల్లీలీటర్లు చొప్పున 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోలు చొప్పున పైరు మొలక ఎత్తిన 25-30 రోజులకు ఆకుల సుడులలో వేయాలి.

నీట్‌లో సత్తా




మయాంక్ శర్మ, బెన్హర్ సాయికిరణ్

గుత్తి: పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు నీట్‌లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించి ప్రతిభ చాటారు. వివరాలు... గుత్తికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు కాంత్రికుమార్, రమాప్రభ దంపతుల కుమారుడు ఎం.మయాంక్ శర్మ నీట్ ఫలితాల్లో 700 మార్కులు సాధించాడు. విజయవాడలో ఇంటర్ విద్యాభ్యాసం చేసిన మయాంక్ శర్మ జాతీయ స్థాయిలో 2,072, కేటగిరి కింద 168వ ర్యాంక్ సాధించడం గమనార్హం. అలాగే గుత్తికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఓబులేసు, పశువైద్యాధికారి భారతి దంపతుల కుమారుడు బెన్హర్ 720 మార్కులకు గాను 696 మార్కులతో జాతీయ స్థాయిలో 2,707, కేటగిరి కింద 63వ ర్యాంక్ సాధించి తన సత్తా చాటాడు.

పెనుకొండ: రామగిరి మండలం గరిమేకలపల్లికి చెందిన సాయికిరణ్ ఇటీవల పెనుకొండలోని ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొంది నీట్ జాతీయ స్థాయిలో 12,824వ ర్యాంక్ సాధించాడు. కేటగిరి స్థాయిలో 5,410వ ర్యాంక్ సాధించిన సాయికిరణ్‌ను కోచింగ్ సెంటర్ యాజమాన్యం అభినందించింది.

యువతి ఆత్మహత్య


మృతురాలు అశ్విని

పెద్దపప్పూరు: క్షణికావేశంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటకు చెందిన రామాంజనేయులు, కంబక్కకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె అశ్విని (19) రెండేళ్ల క్రితం ఇంటర్ పరీక్ష తప్పి ఇంటి పట్టునే ఉంటోంది. మిగిలిన ఇద్దరు కుమార్తెలు ఇంటర్ చదువుతున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున చదువుకుంటున్న చెల్లెళ్లను ఇంటి పనిచేయాలని అశ్విని ఒత్తిడి పెట్టింది. ఆ సమయంలో తల్లిదండ్రులు కోపగించుకున్నారు. 'చదువుకుంటున్న వారిని ఎందుకు చెడగొడతావ్. నీవు కూడా వాళ్ల మాదిరిగానే ఇంటి పట్టున ఉండకుండా బుద్ధిగా కళాశాలకు వెళ్లి చదువుకో' అంటూ హితవు పలికారు. దీంతో క్షణికావేశానికి లోనైన అశ్విని ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కాసేపటికి గట్టిగా చప్పుడు కావడంతో తల్లిదండ్రులు తలుపులు బద్దలుగొట్టి లోపలకు వెళ్లి చూశారు. అప్పటికే ఉరికి వేలాడుతున్న అశ్వినిని గుర్తించి వెంటనే కిందకు దించి ఆస్పత్రికి తీసుకెళుతుండగా మృతి చెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అమానుల్లా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మాతృత్వం చాటుకున్న మేక


మేకపాలు తాగుతున్న ఎనుముదూడ

రాయదుర్గం టౌన్: ఆకలితో అలమటిస్తున్న ఓ దూడకు ఓ మేక తన స్తన్యమిచ్చి మాతృత్వాన్ని చాటుకుంది. గురువారం రాత్రి రాయదుర్గంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పాడిరైతు పవన్‌కు చెందిన గేదె దూడ.. మేక పాలు తాగుతూ కనిపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. మేకలు, గేదెలు తమవేనని, అప్పుడప్పుడు ఓ మేక నేరుగా దూడవద్దకెళ్లి ఇలా పాలు ఇస్తుంటుందని ఆయన వివరించారు.

సందడిగా చేపల వేట


చేపలను క్రేట్‌లలో నింపుతున్న జాలర్లు


క్రేట్‌లలో చేపలను ఒడ్డుకు చేరుస్తున్న దృశ్యం

చుట్టూ పచ్చని పంట పొలాలు... మధ్యలో ఉన్న శింగనమల చెరువు నీటిలో ఎగిసి పడుతూ సందడి చేస్తున్న చేపలు.. ఆహ్లాదాన్ని పంచుతున్న వాతావరణంలో మత్స్యకారులు వలలు పట్టుకుని... తెప్ప (పుట్టి) లేసుకుని చెరువు మధ్యలోకి వెళ్లారు. కాసేపట్లోనే తిరిగి ఒడ్డుకు చేరుకున్నారు. పుట్టి నిండా చేపలే... సందడిగా సాగిన చేపల వేట ఆద్యంతం ఎంతో ఆసక్తిని రేకెత్తించింది. శింగనమల చెరువులోని చేపలు ఎంతో రుచికరంగా ఉంటాయని ప్రసిద్ధి. ఈ క్రమంలో మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారనే విషయం తెలియగానే జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాలకు చెందిన కొనుగోలుదారులు ఒక్కసారిగా అక్కడ వాలిపోయారు. తాజా చేపలను ఖరీదు చేయడానికి పోటీ పడ్డారు. పెద్ద సంఖ్యలో చేపలను బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాలకు తరలించేందుకు కంటైనర్లు సైతం అక్కడకు చేరుకోవడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


చేపలు పట్టి ఒడ్డుకు చేరుకుంటున్న మత్స్యకారులు


శింగనమల చెరువు వద్ద క్రయవిక్రయదారుల సందడి


చేపలను రాసులుగా పోసిన దృశ్యం